ఆయిల్‌పామ్‌పైనే ఆశలు



మూడు నెలలుగా ఆశాజనకంగా ధర | ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ఉద్యానవన శాఖ ప్రోత్సాహకాలతో రైతుకు ఆర్థిక ఆసరా

మండలాల వారీగా సాగు వివరాలిలా..

మండలం	సాగు విస్తీర్ణం
కోటవురట్ల	700 హెక్టార్లు
ఎస్.రాయవరం	160 హెక్టార్లు
పాయకరావుపేట	120 హెక్టార్లు
నక్కపల్లి	40 హెక్టార్లు

కోటవురట్ల: ఆరుగాలం శ్రమించే రైతన్నకు ఏడాదంతా విషమ పరీక్షలే. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకోవడానికి నిరంతరం శ్రమించాల్సిందే. వివిధ పంటల సాగులో రైతుకు ఎన్నో ఆటుపోటులు తప్పవు. తెగుళ్ల దాడి నుంచి ప్రకృతి ప్రకోపం వరకు రైతు తట్టుకోవాల్సిందే. శ్రమకు అదృష్టం కూడా తోడైతే లాభాలు ముంచెత్తుతాయి. ప్రస్తుతం ఆయిల్ పామ్ సాగు రైతుకు మంచి లాభాలను తెస్తోంది. స్థిరమైన ఆదాయంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఉద్యానవన శాఖ ప్రోత్సాహకాలు, మేలైన మార్కెట్ ధరతో మంచి లాభాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆయిల్‌పామ్‌కు మంచి ధర పలుకుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా ధర పెరుగుతూ వస్తుండడంతో సాగుపై రైతులు ఆసక్తి పెంచుకుంటున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 1020 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగులో ఉంది.

కొనుగోలు కేంద్రాలతో భరోసా

ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండడంతో రైతుకు ఇబ్బంది తప్పింది. రవాణా భారం లేకపోవడంతో కొంతమేర లాభాలు పెరుగుతున్నాయి. కోటవురట్ల మండలంలో చినబొడ్డేపల్లి, కోటవురట్లలోను, ఎస్.రాయవరం మండలంలో ఒమ్మవరంలో పతంజలి గ్రూప్ కంపెనీ కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఉద్యానవన శాఖ ప్రోత్సాహకాలతో పాటు నిరంతరం కంపెనీ సిబ్బంది సలహాలు, సూచనలు రైతులకు అందుతున్నాయి.

ఆశలు పెంచుతోంది..



ప్రస్తుత ధర ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం టన్ను ధర 19,371 ఉంది. గత రెండు నెలలుగా ధర పెరుగుతూ వస్తోంది. దగ్గరలోనే కొనుగోలు కేంద్రం ఉండడం వల్ల రవాణా భారం లేకుండాపోయింది. కంపెనీ ప్రతినిధుల ప్రోత్సాహం బాగుంది.

– కిల్లాడ శ్రీనివాసరావు, రైతు, పాములవాక

అవగాహన కల్పిస్తున్నాం..



మిగతా పంటల కంటే ఆయిల్‌పామ్‌లో మంచి ఫలితాలు వస్తున్నాయి. పాయకరావుపేట నియోజకవర్గంలో నేలలు అనుకూలంగా ఉన్నాయి. రైతులను కలిసి అవగాహన కల్పిస్తున్నాం. ఉద్యానవన శాఖ కూడా మంచి రాయితీలు ఇస్తోంది. సకాలంలో సలహాలు, సూచనలు ఇస్తున్నాం. ఏటా నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది.

– అజయ్, క్లస్టర్ ఇన్‌చార్జ్, పతంజలి కంపెనీ

ఐదు నెలలుగా ఆయిల్‌పామ్ గింజల ధరలు ఇలా ఉన్నాయి

నెల	మే	జూన్	జూలై	ఆగస్టు	సెప్టెంబర్
టన్ను (రూ.లలో)	18,650	17,340	17,979	19,095	19,371

ఉద్యానవన శాఖ తోడ్పాటు

ఆయిల్‌పామ్ ధరలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ కచ్చితమైన ఆదాయం రావడంతో పలువురు రైతులు ఆయిల్‌పామ్ సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఆయిల్‌పామ్ తోటల్లో ఫలసాయం వచ్చేంత వరకు ఉద్యానవన శాఖ రైతుకు పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. మొక్కలను ఉచితంగా ఇవ్వడంతో పాటు నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు కూడా భరిస్తోంది. ఫలసాయం వచ్చేంత వరకు అంతర పంటల సాగుకు కూడా నాలుగేళ్ల పాటు ప్రోత్సాహకం అందిస్తోంది. ప్రస్తుతం హైబ్రిడ్ రకం ఒక మొక్క ఖరీదు రూ.193 కాగా హెక్టారు పరిధిలో 143 మొక్కలు పడతాయి. వీటికి రూ.27,599 ఖర్చు కాగా ఉద్యానవన శాఖ పూర్తిగా ఉచితంగా మొక్కలను అందిస్తోంది. ఇక నాలుగేళ్ల పాటు మొక్కల పెంపకం, ఎరువుల ఖర్చు కోసం హెక్టారుకు రూ.5,250 ఇస్తోంది. ఇది కాకుండా నాలుగేళ్ల వరకు అంతర పంటల సాగుకు అదనంగా మరో రూ.5,250 అందిస్తోంది. ఇవి కాకుండా 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు మంజూరు చేస్తున్నారు.



కోటవురట్లలోని కొనుగోలు కేంద్రం వద్ద ఆయిల్‌పామ్ గెలలు



ప్రస్తుతం ధర బాగుంది..



ఆయిల్‌పామ్‌కు ప్రస్తుతం మంచి ధర పలుకుతోంది. ఇదే ధర కొన్నాళ్ల పాటు కొనసాగితే రైతులకు మంచి లాభాలు వస్తాయి. ప్రస్తుతం అన్ని పంటల్లో ఆయిల్‌పామ్‌కు సాగుకు మంచి ప్రోత్సాహం అందుతోంది. ఉద్యానవనశాఖ కూడా పలు రాయితీలు ఇస్తోంది. మిగతా పంటల్లో నష్టాలు వెంటాడుతున్నాయి. గతంలో చెరకు పంట ఎక్కువగా సాగు చేసేవాళ్లం. ప్రస్తుతం చెరకు పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ మారింది.

–సిద్ధాబత్తుల పోతురాజు, రైతు, కైలాసపట్నం

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే చెంగల



నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండలి(ఎస్‌ఈసీ) సభ్యుడిగా నియమితులైన పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు మంగళవారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ కార్యనిర్వాహక మండలిలో తనకు స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం



గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో భక్తుల పూజలు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం గౌరీపరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గౌరీపరమేశ్వరుల విగ్రహాలను రావి చెట్టు నుంచి సంతబయిల వరకు మేళ తాళాలతో ఊరేగించారు. అనంతరం విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠింపజేశారు. పలువురు భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గాయపడిన యువకుడి మృతి

కోటవురట్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోలుగుంట మండలం కొమరువోలు గ్రామానికి చెందిన కోడి ప్రసాద్(35) వ్యక్తిగత పని మీద గత నెల 20న బైక్‌పై ఎస్.రాయవరం వెళుతుండగా మండలంలోని జల్లూరు వంతెన దాటాక కుక్క అడ్డురావడంతో రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో అతనిని 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 6న మృతి చెందాడు. మృతుడు ప్రసాద్ తల్లి కోడి పెద్ద బుల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

'ఆదర్శవంతంగా తోటాడ పంచాయతీ'

మునగపాక: తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి అన్నారు. మంగళవారం సచివాలయంలో తోటాడ పంచాయతీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోటాడ పంచాయతీలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించామన్నారు. ప్రధానంగా శ్మశానవాటిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు, దొడ్డి రమేష్, పాలమరశెట్టి మురళి, ఆడారి ప్రసాద్, నాగేశ్వరరావు, తదితరులు ఈ సభలో పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: యలమంచిలి విద్యుత్ సెక్షన్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. యలమంచిలి ఉపకేంద్రం పరిధిలో యలమంచిలి, కొత్త ఎర్రవరం, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లు, కట్టుపాలెం, కొత్తపాలెం, రామారాయుడుపాలెం, సోమలింగపాలెం సాధారణ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

మునగపాక: రైతులకు మేలు చేకూరేలా సంఘ సభ్యులు సేవలందించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. నాగులాపల్లి పీఏసీఎస్ ఆవరణలో మంగళవారం 3,655 మంది రైతులకు రూ.6.60 లక్షల మేర డివిడెండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి వెంకట భాస్కరరావు, డైరెక్టర్లు, సంఘం సీఈవో మళ్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ సర్కారు తీరుపై సంతకాల సేకరణ

అచ్యుతాపురం రూరల్: ప్రధాని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త తనకాల అనంతరావు ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మరాజుపేట కూడలిలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.ఆర్.రాహుల్, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు పి.ఆదిమూర్తి, రామ సత్యం, దొడ్డి రవి, మోహన్, సంజీవ్, లక్ష్మణరావు, నాగు, సాయి పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటన జయప్రదం చేయండి

వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీ పిలుపు

అచ్యుతాపురం రూరల్: సామాన్యులకు అందుబాటులో ఉచిత వైద్యం అందాలని పోరాడుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని ఆ పార్టీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు అధ్యక్షతన అచ్యుతాపురంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరు చేసిన 17 మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమన్నారు. ఇప్పటికే 7 కళాశాలలు అందుబాటులోకి రాగా.. మరో 10 కళాశాలల నిర్మాణం 60 శాతం పైగా పూర్తయినట్టు చెప్పారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన పర్యటనను అందరూ విజయవంతం చేయాలని ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మాకవరపాలెం మండలంలోని వైద్య కళాశాల భవనాల వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపి ఘనంగా స్వాగతించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, పార్టీ సీనియర్ నాయకులు మారిశెట్టి సూర్యనారాయణ, భీముని వెంకటేశ్వరావు, వైస్ ఎంపీపీలు వాసుపల్లి పద్మశ్రీనివాస్, అల్లంపల్లి లక్ష్మీఅప్పారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాంబిల్లి సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం యలమంచిలి పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి శ్రేణులు వచ్చేలా నాయకులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణిరాము, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, యలమంచిలి పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథరావు, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు పలివెల అమృతవల్లి, దూది నర్సింహమూర్తి, కొఠారు కొండబాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: ఈ నెల 9న జరగనున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మునగపాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అందరూ తిప్పికొట్టాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మునగపాకలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

జగనన్నకు అండగా నిలవాలి

రాంబిల్లి(అచ్యుతాపురం): ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసే దమ్ము మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. రాంబిల్లిలో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ గురువారం తలపెట్టిన మాకవరపాలెం పర్యటనలో అధిక సంఖ్యలో పాల్గొని, ఆయనకు అండగా నిలవాలని ధర్మశ్రీ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కిశోర్, పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు బోదెపు గోవింద, ప్రచార కమిటీ అధ్యక్షుడు కొవిరి రామకృష్ణ, రేబాక రాము, నెట్టెం సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

ఎస్.రాయవరం: ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ ముఖ్య నేతలతో అడ్డురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణ నిర్ణయానికి నిరసనగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం గ్రామంలో వైద్య కళాశాలను గురువారం సందర్శించనున్నారని, ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, అదనపు కార్యదర్శి సాగి సీతారామరాజు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, నాలుగు మండలాల అధ్యక్షులు ఎస్ఏఎస్ మధువర్మ, గెడ్డమూరి శ్రీనివాస్, శ్రీరం నరసింహమూర్తి, కిలాడి శ్రీనివాసరావు, ధనిశెట్టి బాబూరావు, జిల్లా అధికార ప్రతినిధి డి.సాయిబాబా, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, పైలా రమేష్, పార్టీ నాయకులు సూరకాసుల గోవింద, జగతా శ్రీను, లొడగల చంద్రరావు, చోడిపల్లి గోవిందు పాల్గొన్నారు.

- మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనను మండల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మధువర్మ పిలుపునిచ్చారు. అడ్డురోడ్డు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల నాయకులతో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జోగులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెదుళ్ల బంగారి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, జిల్లా మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు మాతా గురునాథరావు, సర్పంచ్‌లు కోశెట్టి వెంకటరమణ, మల్లే లోవరాజు, సీనియర్ నాయకులు అద్దేపల్లి నూకునాయుడు, దుబాసి సాయివెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

పాయకరావుపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం జిల్లాలో తలపెట్టిన పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా పిలుపునిచ్చారు. నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలోని మెడికల్ కళాశాలను ప్రైవేట్‌పరం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా ఈ పర్యటన సాగుతుందన్నారు. ఈ పర్యటనలో జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

కనీస వేతనాల కోసం ఆశా వర్కర్ల ఆందోళన



గొడిచర్ల పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు



వైద్యాధికారి నాగలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు

నక్కపల్లి: తమకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు మంగళవారం గొడిచర్ల పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, వారికి ఉద్యోగ భద్రత కల్పించలేదని ఆరోపించారు. ఆశా వర్కర్లతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. పీహెచ్‌సీకి వచ్చిన ప్రతిసారి టీఏ, డీఏ ఇవ్వాలని, ఏఎన్‌ఎం ట్రెనింగ్ పూర్తి చేసిన వారికి ఏఎన్‌ఎం నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఆశా కార్యకర్తలు మరణిస్తే దహన సంస్కారాలకు రూ.20 వేలు ఆర్థిక సాయం చేయాలన్నారు. ఆశా కార్యకర్తలకు రికార్డు వర్క్ రద్దు చేయాలని, ఆన్‌లైన్ పనులకు 5జీ సిమ్‌కార్డులు, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లు అందించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పోరాటానికి సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రాజేష్, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా ఆశాలు ఎక్కడ?

మునగపాక: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆశా కార్యకర్తలు స్థానిక పీహెచ్‌సీ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరికి సీఐటీయూ నేత బ్రహ్మాజీ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు నేటి వరకు కనీస వేతనాలు అందించడం లేదన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా కార్యకర్తల నియామకం జరగడం లేదని ఆరోపించారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని కోరారు. ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా కోశాధికారి పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో ఆశా కార్యకర్తలు కుమారి, వీర కోట, వెంకటలక్ష్మి, అరుణ, జయ, పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

రాంబిల్లి(అచ్యుతాపురం): ఆశా కార్యకర్తల దీర్ఘకాలిక సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో రాంబిల్లి పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని, టీఏ, డీఏలు ఇవ్వాలని, అదనపు పనులు తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అధికారులకు ఆశా కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేవుడు నాయుడు, ఆశా కార్యకర్తల యూనియన్ నాయకులు మంగ, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం సీఐటీయూ నాయకుడు కూండ్రపు సోమునాయుడు ఆధ్వర్యంలో వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు ఎస్.సూర్యలక్ష్మి, సిహెచ్. మంగమ్మ, పార్వతి, దేవుడమ్మ, పల్లవి, లావణ్య, దుర్గా, పోలమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబురాజుకు అభినందనలు

యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్‌గా నియమితులైన యలమంచిలి మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు)కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ఏటికొప్పాకకు చెందిన పార్టీ నాయకులు మంగళవారం రాత్రి కన్నబాబురాజును విశాఖపట్నంలో ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కన్నబాబురాజుకు మరింత ఉన్నత పదవి రావాలని వారంతా ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి నాయకులంతా సైనికుల్లా పనిచేయాలని కన్నబాబురాజు వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు, సీనియర్ నాయకులు సేనాపతి రాము, కరణం రవి, జెల్లీ ఆదిరెడ్డి, మైలారు శ్రీను, శెన్నంసెట్టి రాము, ఎర్రంశెట్టి రమణ, దేవరపల్లి రమణ, తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏటికొప్పాక నాయకులు

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

యలమంచిలి రూరల్: ఏటికొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్టు ప్రతినిధులు దృష్టిలోపం ఉన్న 12 మంది విద్యార్థులకు కళ్లద్దాలు ఉచితంగా అందజేశారు. కోటవురట్ల మండలం పొందూరు ఎంపీపీ పాఠశాలలో దృష్టిలోపం ఉన్న బాలికకు కూడ కంటి అద్దాలు అందజేసినట్టు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఈ రెండు స్కూళ్లను దత్తత తీసుకున్న ట్రస్టు గత నెల 2న 331 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 13 మందికి దృష్టిలోపం గుర్తించి కళ్లద్దాలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైద్యులు డాక్టర్ సి.విజయ్‌గోపాల్‌రాజు, డాక్టర్ పి.వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.



కళ్లద్దాలు అందుకున్న విద్యార్థులతో విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్టు ప్రతినిధులు

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం

మునగపాక: సీజన్‌లో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని మునగపాక పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు సూచించారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆశా కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు

ఈకేవైసీతో దొంగ మస్తర్ల నివారణ



తిమ్మరాజుపేటలో ఈకేవైసీ పరిశీలిస్తున్న పీడీ పూర్ణిమాదేవి

మునగపాక: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కార్మికులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డుమా పీడీ పూర్ణిమాదేవి కోరారు. మండలంలోని తిమ్మరాజుపేట, చూచుకొండ గ్రామాల్లో జరుగుతున్న ఈకేవైసీ ప్రక్రియను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల్లోగా ప్రతి కార్మికుడు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఒకరికి బదులు మరొకరు పని చేయడం, దొంగ మస్తర్లను నివారించేందుకు ఈ ప్రక్రియ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏపీవో శివతో పాటు పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన చినగుమ్ములూరు విద్యార్థులతో ఉపాధ్యాయులు



దార్లపూడి విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: చినగుమ్ములూరు ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు పీడీ ప్రేమ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సెలక్షన్స్‌లో అండర్–14 విభాగంలో సీహెచ్ భవ్యశ్రీ, కె.దీపిక, అల్లు హేమంత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. వారిని హెచ్‌ఎం శకుంతల, ఉపాధ్యాయులు అభినందించారు. దార్లపూడి ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు పీఈటీ నిర్మల తెలిపారు. 10వ తరగతి చదువుతున్న జిలుగుల తారక లక్ష్మి, పినపోలు భార్గవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు వారిని హెచ్‌ఎం జాన్, ఉపాధ్యాయులు అభినందించారు.

బీచ్ వాలీబాల్ పోటీలకు గుంటపల్లి విద్యార్థులు

పాయకరావుపేట: రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు గుంటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.రామారావు తెలిపారు. గుంటపల్లి పాఠశాల నుంచి అండర్–14 బాలికల విభాగంలో డి.రాణి, డి.బాలశ్రీ, బాలుర విభాగంలో అస్మిత్‌బాబు ఎంపికయ్యారు. ముగ్గురు విద్యార్థులు బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా తరఫున పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయుడు ఆర్.వెంకన్న, పీడీ టి.రవికుమార్, సిబ్బంది అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు